

పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయప్రాంగణంలోని శనగల బసవన్న, శ్రీ బయలువీరభద్ర స్వామికి మంగళవారం దేవస్థానం అధికారులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు.



నేను కచ్చితంగా ఓటేస్తా..

'నేను కచ్చితంగా ఓటేస్తా' అనే యువ నినాదంతో ఓటరు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో..



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,618.46
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 57.119
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,399

న్యూస్‌రీల్

బనగానపల్లె నియోజకవర్గానికి చేనేత క్లస్టర్

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల జిల్లాలోని బనగానపల్లెకు చేనేత క్లస్టర్ మంజూరైనట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు హరికృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన నేపథ్యంలో కర్నూలులోని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని విభజించలేదని, ఈ కార్యాలయం ఉమ్మడిగానే పనిచేస్తోందన్నారు. కొద్ది నెలల క్రితం బనగానపల్లె నియోజకవర్గంలో చేనేత క్లస్టర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా ఆమోదం లభించిందన్నారు. రూ.1.11 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. నందివర్గం, ఐ.కొత్తపేట, పలుకూరు తదితర గ్రామాల్లోని 97 మంది చేనేత కార్మికులకు కోరుకున్న అధునాతన మగ్గం పరికరాలు అందిస్తామన్నారు. 90 శాతం సబ్సిడీతో వీటిని అందిస్తుండగా.. 10 శాతం నిధులను లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందని తెలిపారు.

ఆలమూరుకు చేరిన అహోబిలేశుడు



ఆలమూరులో ఉత్సవ మూర్తులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రుద్రవరం: తన వివాహానికి ఆహ్వానం పలికేందుకు బయలుదేరిన అహోబిలేశుడు మంగళవారం ఆలమూరుకు చేరుకున్నారు. గ్రామ సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, తహసీల్దారు వెంకటశివ, పంచాయతీ అధికారులు, గ్రామ పెద్దలు మేళ తాళాలతో స్వాగతం పలికారు. పార్వేట ఉత్సవమూర్తులైన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి పల్లకీ యాదవాడ నుంచి ఆలమూరుకు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

అన్నప్రసాద వితరణకు రూ.51లక్షల విరాళం



విరాళానికి సంబంధించిన చెక్‌ను ఈఓకు అందజేస్తున్న దాత హర్రీ గిల్

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పంజాబ్‌కు చెందిన హర్రీ గిల్ మంగళవారం రూ.51లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని దేవస్థానం ఈఓ ఎస్.లవన్నకు అందజేయగా, వారు దాతలకు దేవస్థానం తరపున స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

జేఈఈ మెయిన్స్‌కు నలుగురు గైర్హాజరు

నంద్యాల(సిటీ): జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్) మెయిన్స్ తొలివిడత పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బీఈ, బీటెక్ విభాగాల్లో నిర్వహించారు. రెండు సెషన్లలో జరిగిన ఈ పరీక్షలకు 220 మంది అభ్యర్థులను గాను 216 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు.

జిల్లాలో ఎరువులు పుష్కలం

నంద్యాల(అర్బన్): జిల్లాలో రబీ సాగు రైతులకు అవసరమైన ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, కొరత ఎక్కడా లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి తెలిపారు. ఎవరైనా డీలర్లు కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఎరువుల గోడౌన్లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జిల్లాలో యూరియా పుష్కలంగా ఉందని, కొరత ఏర్పాడుతుందేమోనని ముందుగా అధిక మొత్తంలో ఎరువులను కొనుగోలు చేయవద్దని రైతులకు సూచించారు.

నేటి నుంచి ఏపీ సీఎం కప్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 25 నుంచి ఏపీ సీఎం కప్ ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న అథ్లెటిక్స్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, టెన్నిస్ 27న బాల్ బాడ్మింటన్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, హాకీ, బాడ్మింటన్, 28న ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.



శ్రీశైల మల్లికార్జునునిపై లైట్ అండ్ సౌండ్ ప్రదర్శన



జ్యోతిర్లింగ క్షేత్రాలను వివరిస్తూ..



శ్రీశైల భ్రమరాంబా దేవి గురించి..



కళ్లముందు అష్టాదశ శక్తిపీఠాలు

దివ్య తేజం.. భక్తి భావం

ఓ వైపు రంగురంగుల కిరణాలతో దేవతామూర్తులు కళ్ల ముందు ఆవిష్కృతమవుతుండగా.. మరో వైపు భక్తి భావాన్ని తట్టిలేపేలా ఓంకార నాదం మనస్సు తాకుతుండగా.. సరికొత్త ఆధ్యాత్మిక ప్రపంచంలోకి అడుగు పెట్టామనే భావన కలుగుతుంది. నల్లమల గిరుల్లోని శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులు మరింత ఆధ్యాత్మిక ఆనందానికి చేరువవుతున్నారు. శ్రీశైల వైభవం చాటేలా ఇటీవల క్షేత్రంలో ప్రారంభించిన లైట్ అండ్ సౌండ్ షో కార్యక్రమానికి భక్తుల నుంచి ఆదరణ పెరుగుతోంది.

- శ్రీశైలంలో ఆకట్టుకుంటున్న లైట్ అండ్ సౌండ్ షో
- రోజూ సాయంత్రం రెండు ప్రదర్శనలు
- శ్రీశైల స్థల పురాణం, చరిత్ర అంశాలతో సంగీత, దృశ్య కావ్యం
- భక్తుల నుంచి విశేష స్పందన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల స్థల పురాణం, చరిత్ర తదితర అంశాలపై నిర్వహిస్తున్న లేజర్ షో కార్యక్రమంతో భక్తులు తన్మయత్వానికి లోనవుతున్నారు. ప్రసాద్ పథకం కింద చేపట్టిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఈనెల 16వ తేదీన ప్రారంభించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో నాగులకట్ట వెనుక లైట్ అండ్‌సౌండ్ షోను ఏర్పాటు చేశారు. స్వామిఅమ్మవార్ల దర్శనం అనంతరం సాయంత్రం నిర్వహించే ఈ ప్రదర్శనలో భక్తులు పాల్గొని తరిస్తున్నారు. శ్రీశైల స్థలపురాణం, క్షేత్ర మహిమలు, స్వామిఅమ్మవార్ల మహిమలు, చరిత్ర దృశ్య, ధ్వని ప్రదర్శనను ప్రదర్శించడంతో భక్తులు వివరంగా తెలుసుకుని అవగాహన చేసుకుంటున్నారు. ప్రతి రోజు రాత్రి 7 గంటలకు మొదటి ప్రదర్శన, రాత్రి 8.15 గంటలకు రెండవ ప్రదర్శన ఉంటుంది. ఈ ప్రదర్శన తిలకించేందుకు ఒక్కొక్కరికి ప్రవేశ రుసుం రూ.50గా నిర్ణయించారు. ప్రతిరోజు



శ్రీశైలక్షేత్ర స్థల పురాణం గురించి..

సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవేశ టికెట్లు ఇస్తున్నారు. అమ్మవారి ఆలయ వెనుక భాగంలో ఏర్పాటు చేయబడిన ప్రత్యేక కౌంటర్ ద్వారా టికెట్లను భక్తులు పొందవచ్చు. ఈ లేజర్ షోను తెలుగు, కన్నడ, ఆంగ్ల భాషల్లో రూపొందించగా ప్రస్తుతం రెండు విడతల్లో కూడా తెలుగు భాషలో మాత్రమే ప్రదర్శన నిర్వహిస్తున్నారు. కర్ణాటక భక్తులు అధికంగా ఉండే సమయంలో ముఖ్యంగా ఉగాది, శ్రావణమాసం తదితర సమయాల్లో కన్నడ భాషలో ప్రదర్శన ఉంటుందని ఆలయ అధికారులు చెబుతున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా అవసరం మేరకు ఆంగ్ల భాషలో కూడా ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

శివ పార్వతులు సాక్షాత్కరించినట్లుగా..

శ్రీశైలాలయ ప్రాంగణంలో రోజూ ప్రదర్శించే లైట్ అండ్ సౌండ్ షో సుమారు 40 నిమిషాల పాటు ఉంటుంది. ఈ ప్రదర్శనలో జ్యోతిర్లింగాల పరిచయం, అష్టాదశ శక్తిపీఠాల పరిచయం, శ్రీశైలక్షేత్ర ప్రాశస్త్యం, శిలాద మహర్షి కుమారుడైన పర్వతుడు తపస్సుతో శివుడిని మెప్పించి పర్వత ఆకారాన్ని పొంది, 'శ్రీపర్వతం'గా మారడం, శ్రీపర్వతంపై పరమేశ్వరుడు శ్రీపర్వతస్వామిగా స్వయంగా కొలువుదీరడం, ఆదిపరాశక్తి భ్రమర (తుమ్మెద) రూపాన్ని ధరించి అరుణాసురుడును సంహరించి శ్రీశైలంలో భ్రమరాంబాదేవిగా అవతరించడం, కాలక్రమంలో శ్రీపర్వతం శ్రీశైలంగా, శ్రీపర్వత స్వామి శ్రీమల్లికార్జునస్వామిగా పిలవబడడం, చంద్రావతికథ, శ్రీశైలంలో ఆదిశంకరుల తపస్సు, అక్కమహాదేవి ఇతివృత్తాంతం, శ్రీశైలంలో తపస్సు ఆచరించడం, కదలివనంలో సిద్ధిపొందడం, శ్రీశైల చారిత్రక విశేషాల అంశాలతో ఈ ప్రదర్శన ఉండటంతో భక్తులు ఆధ్యాత్మిక చింతనకు లోనవుతున్నారు.



లైట్ అండ్ సౌండ్ షోకు హాజరైన భక్తులు

భక్తులకు మరపురాని అనుభూతి



ఇటీవల ప్రారంభించిన శ్రీశైల వైభవ లైట్ అండ్ సౌండ్ షో పట్ల భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారు. ముఖ్యంగా యువతి, యువకులు, చిన్నపిల్లలు ఈ ప్రదర్శనపట్ల మక్కువ చూపిస్తున్నారు. ఈ ప్రదర్శనను తిలకించడం ద్వారా స్వామిఅమ్మవార్ల ఆవిర్భావం, క్షేత్ర మహిమ విశేషాలు, చరిత్ర, స్వామిఅమ్మవార్లను సేవించిన భక్తుల ఇతివృత్తాంతాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. యాత్రికులకు ఈ ప్రదర్శన మరపురాని అనుభూతిని ఇస్తుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

– ఎస్. లవన్న, ఈఓ, శ్రీశైల దేవస్థానం

అద్భుతంగా ఉంది



లేజర్ షోలో శివుడు, భ్రమరాంబా దేవి స్వామిఅమ్మవారుల గురించి వివరించే విధానం చాలా అద్భుతంగా ఉంది. భక్తులకు పురాణాలు, ఇతిహాసాలపై మరింత అవగాహన కలుగుతుంది. భక్తి భావం పెంపొందించేలా దేవస్థానం మరిన్ని కార్యక్రమాలు చేపడితే బాగుంటుంది.

– సురేష్, కర్నూలు

హిందీ, ఇంగ్లిష్‌లో ఏర్పాటు చేయాలి



శ్రీశైల క్షేత్రానికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రతి రోజు హిందీ, ఇంగ్లిషులో కూడా ప్రదర్శన ఏర్పాటు చేయాలి. చిన్న పిల్లలకు సైతం అర్థమయ్యేరీతిలో ప్రదర్శన ఉంది. పరమేశ్వరుడు, శ్రీశైల క్షేత్ర ప్రాశస్త్యం, మహిమలు భక్తులకు అర్థమయ్యేలా వివరించారు.

– శబరీష్, హైదరాబాద్

షోపై అవగాహన కల్పించాలి



లైట్ అండ్ సౌండ్ షోను చిన్న పిల్లలు చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు. పిల్లలకు కూడా అర్థం అయ్యే విధంగా మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవిల గురించి చక్కగా వివరించారు. ఈ షోను భక్తులు చూసేలా క్షేత్ర పరిధిలో బోర్డులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలి.

– కీర్తి, బెంగళూరు

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



ఆలయ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: పురాతన ఆలయాలను పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నా రు. మంగళవారం పట్టణంలోని గౌరిపేట ఆంజనేయ, చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో రూ. 1.50 కోట్లతో పునర్నిర్మాణం చేసే వినాయక, వేణుగోపాల, మాధవ స్వామి, ఉత్తర ద్వారం, కాలక్షేప మండప నిర్మాణానికి భూమి పూజ చేశారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి బుగ్గన మాట్లాడుతూ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ముఖ ద్వారం రాతితో నిర్మించేందుకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అలాగే శైవ పుణ్య క్షేత్రమైన ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామి గాలిగోపురంతో పాటు ఆలయ ముఖ ద్వార నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని గుండాల చెన్నకేశవ స్వామి, రాచర్ల కంబగిరి స్వామి దేవాలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానన్నారు. కార్యక్రమంలో ఆంజనేయ స్వామి, మద్దిలేటి స్వామి ఆలయాల ఈఓలు మద్దిలేటి, పాండురంగారెడ్డి, పాలకమండలి సభ్యులు, , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గౌరిపేటలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వారికి కలిగిన లబ్ధిని వివరించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శిరిడీ సాయిబాబా ఆలయ 15 వ వార్షికోత్సవ కార్యక్రమానికి మంత్రి బుగ్గన హాజరై బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మూర్తుజావలి, మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో చైర్మన్ నారాయణ, ఆలయ మాజీ చైర్మన్ గుండా జగన్, వార్డు కౌన్సిలర్ శకుంతల, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



బాలికా సంరక్షణ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎంపీ తదితరులు

బాలికలను బాగా చదివించండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- ఘనంగా జాతీయ బాలిక దినోత్సవం
- హాజరైన ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల: ఆడపిల్లలకు చదువు మధ్యలో మాన్పించకుండా బాగా చదివించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని శామూన్ తల్లిదండ్రులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాబున్నీసా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు అన్ని రకాల పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తమ ఆడ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు తమ ఆడ పిల్లల చదువు విషయంలో ఆలోచన ధోరణి మార్చుకోవాలన్నారు. ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహించడంతో పాటు మగ పిల్లలతో సమానంగా అవకాశాలు కల్పిస్తుందన్నారు. అలాగే జిల్లాలో గర్భిణులు, బాలింతలు, కౌమారదశ బాలికల్లో రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, ఐరన్ ఫోలిక్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ మహిళ బాగుంటే కుటుంబం బాగుంటుందన్న నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వివిధ సంక్షేమ పథకాల అమలులో వారికే పెద్దపీట వేస్తున్నారన్నారు. రాజకీయంగా కూడా ప్రోత్సహిస్తూ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. అనంతరం కలెక్టర్, ఎంపీ తదితరులు మహిళల సంరక్షణపై ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేసి పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. అంతకుముందు వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఖజానా శాఖ డీడీ లక్ష్మీదేవి, సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ప్రసాద్, ఆచార్య ఎన్జీరంగా సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణ, వరల్డ్ విజన్, సోషల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

మరో 13 పశు ఆరోగ్య సేవా రథాలు

- నేడు తాడేపల్లిలో జెండా ఊపి ప్రారంభించనున్న సీఎం
- కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 కేటాయింపు
- 1962 కాల్ చేస్తే పశువులకు సత్వరం వైద్య సేవలు



కర్నూలు(అగ్రికల్చర్): నోరు లేని మూగజీవుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ సేవలు మరింత విస్తరించనున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గానికి ఒకటి ప్రకారం మొత్తం 14 అంబులెన్స్ సేవలు సేవలు అందిస్తున్నాయి. వీటి సేవలను రైతులకు మరింత దగ్గర చేసేందుకు నియోజకవర్గానికి అదనంగా మరో సంచార పశు ఆరోగ్య సేవా రథాలు వస్తున్నాయి. వీటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 25న (బుధవారం) తాడేపల్లి క్యాంపు కార్యాలయం వద్ద పచ్చ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈ నెల 26న పశు ఆరోగ్య సేవా రథాలు జిల్లాకు చేరుకుంటాయి. 108, 104 తరహాలోనే 1962కు కాల్ చేస్తే డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశువైద్య సేవ రథాలు గంట, గంటన్నర వ్యవధిలోనే గ్రామానికి చేరుకుని పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించి కాపాడుతున్నాయి. గత ఏడాది మే నెలలో నియోజక వర్గాల వారీగా మొదటి విడత వీటిని ప్రారంభించింది. వీటి ద్వారా ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 8,000 మూగజీవులకు సత్వర వైద్య సేవలు అందాయి. రెండో విడత మంజూరైన 13 సంచార పశు వైద్య క్లీనిక్‌లను అర్బన్ నియోజకవర్గమైన కర్నూలు మినహా ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాలకు కేటాయించారు. కర్నూలు జిల్లాకు 6, నంద్యాల జిల్లాకు 7 ప్రకారం మంజూరైన పశు ఆరోగ్య సేవా రథాలను రైతులకు అందుబాటులో ఉండేలా లోకేషన్లను కూడా పశుసంవర్ధక శాఖ గుర్తించింది. మరో రెండు రోజుల్లో ఇవి అందుబాటులోకి వస్తుండటంతో పశువులకు మరింత వేగంగా వైద్య సేవలు అందే అవకాశం ఉంది.

ఆర్‌బీకేల్లో విజిలెన్స్ తనిఖీలు

కర్నూలు: కర్నూలు, నంద్యాల జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ శంకబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు కర్నూలు ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందాలు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. సబ్సిడీ విత్తనాల నాణ్యత, రైతుల ఈ–క్రాప్ బుకింగ్ ఇన్సూరెన్స్ అందిన తీరు, తదితర అంశాలపై ఆరా తీశారు. తనిఖీల్లో సీఐలు కేశవరెడ్డి, శ్రీధర్, డీఈ గుణకర్ రెడ్డి, ఏఏఓ షణ్ముఖ గణేష్, ఎఫ్ఆర్వో ఖాన్, ఏజీ సిద్ధయ్య, ఎస్ఐ నగేష్, ఏఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కర్నూలు జిల్లాలోని వెల్దుర్తి వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం, నంద్యాల జిల్లా పాణ్యం మండలం బల్లనూరు, నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

గణతంత్ర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



రిహార్సల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ గణతంత్ర వేడుకలకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పోలీసు కవాతు రిహార్సల్‌ను ఎస్పీ పరిశీలించారు. పరేడ్ కమాండర్ సుధాకర్ జిల్లా ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో కవాతు అద్భుతంగా నిర్వహించాలన్నారు. వేడుకలకు ముఖ్యఅతిథులు, పాఠశాల విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, ఏఆర్ అదనపు ఎస్పీ చంద్రబాబు, ఏఆర్ డీఎస్పీ సంకురయ్య పాల్గొన్నారు.

గడువులోగా పెండింగ్ కేసులు పరిష్కరించాలి

అరెస్ట్‌లు, చార్జ్ షీట్‌లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్‌లు పెండింగ్‌లో పెట్టకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో నేర సమీక్షపై సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, స్థితి గతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసుల్లో నేరస్తులకు శిక్ష పడే విధంగా చూడాలన్నారు. కేసుల వివరాలను సీసీటీ ఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందు పరచాలన్నారు. హత్య కేసులు, పోక్సో, అత్యాచారం కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, నంద్యాల టౌన్, ఆళ్లగడ్డ డీఎస్పీలు మహేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దిశా డీఎస్పీ మారుతిరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలి

కర్నూలు కల్చరల్: జర్నలిస్టుల రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరుతూ కేంద్ర ఐటీ శాఖ మంత్రి దేవు సిన్హ్ చౌహాన్, మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్‌కు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు మంగళవారం కర్నూలు ప్రభుత్వ అతిథి గృహంలో వినతి పత్రం అందజేశారు.



పెళ్లంటే.. పందిళ్లు.. సందళ్లు.. తప్పెట్లు.. తాళాలు.. తలంబ్రాలు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులు కళ్లు మిరుమిట్లు గొలిపే సెట్టింగులు.. రంగురంగుల విద్యుత్ దీపకాంతులు..ఆత్మీయతల పరిమళాలు. ఈ సందడి రానే వచ్చింది. ఈ సారి ఏడాది పొడవునా పెళ్లి బాజాలు మోగనున్నాయి. కొత్త సంవత్సరంలో శుభ ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి.

మోగనున్న పెళ్లి బాజా

- నేటి నుంచి శుభ ముహూర్తాలు
- ఒక్కటి కానున్న వందలాది జంటలు
- కళకళలాడనున్న కల్యాణ మండపాలు

కొలిమిగుండ్ల: శుభకృతనామ సంవత్సరం కావడంతో శుభాలు కలగనున్నాయి. ఈ ఏడాదిలో నేటి నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. కొద్ది రోజుల నుంచి మంచి ముహూర్తాలు లేక గ్రామాలు, పట్టణాల్లో సందడి కనిపించడంలేదు. ఈ ప్రభావం వ్యాపారాలపై కూడా పడింది. ఇప్పటి నుంచి వివాహాలతో పాటు గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలకు మంచి రోజులు ఉండటంతో మళ్లీ సందడి మొదలుకానుంది. ఏప్రిల్, జూలై మినహా మిగతా అన్ని నెలల్లో కలిపి 104 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి.

ఏర్పాట్లలో బిజీ

ముహూర్తాలు మొదలు కావడంతో ఎవరి పనుల్లో వారు బిజీ అయ్యారు. పెళ్లి పత్రికలు అచ్చు వేయడం మొదలు కొని కల్యాణ మండపాలు బుకింగ్, వంట మనుషులు, పురోహితులు, నాయీ బ్రాహ్మణులు, డెకరేషన్, పూలు, ఫొటోగ్రాఫర్స్, జీపులు, బస్సులు ఇలా ప్రతిదీ ముందస్తుగానే బుక్ చేసుకుంటున్నారు. బంగారం, బట్టల దుకాణాలకు కళ వచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని యాగంటి, మహానంది, శ్రీశైలం, మంత్రాలయం తదితర పుణ్యక్షేత్రాల వద్ద గదులు, ఫంక్షన్ హాళ్లను నిర్వాహకులు ముందుగానే రిజర్వ్ చేసుకున్నారు. మరికొందరు బంధువులు, సన్నిహితులను ఆహ్వానించే పనిలో నిమగ్నమయ్యారు. పట్టణాల తరహాలో గ్రామాల్లో సైతం ఇళ్ల నిర్మాణాలను అందంగా ఆకర్షణీయంగా ఒకరికొకరు పోటీ పడి నిర్మించుకుంటున్నారు. ముహూర్తాలు ఉండటంతో ఈసారి గృహ ప్రవేశాలు కూడా భారీగా జరుగనున్నాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో వివాహాలు జరుగనుండటంతో ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణ మస్తు, వైఎస్సార్ తోఫా పథకాల ద్వారా చాలా మంది జంటలకు లబ్ధి చేకూరనుంది.

పెళ్లిళ్ల పేరయ్యలకు గిరాకీ

ఈ ఏడాదిలో వందకు పైగా ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్ల పేరయ్యలకు గిరాకీ పెరిగింది. ప్రస్తుతం పెళ్లి చేసుకునేందుకు చాలా మంది వారిపైనే ఆధారపడుతున్నారు. అన్ని సామాజిక వర్గాల్లో అమ్మాయిలకు డిమాండ్ పెరిగింది. అబ్బాయిలకు అందం, డబ్బు, ఉద్యోగం, హోదా ఉన్న మ్యాచింగ్ కుదరడం లేదు. చాలా మందికి అన్ని రకాల వనరులున్నా పదుల సంఖ్యలో పెళ్లి చూపులు చూస్తున్నా సెట్ కావడం లేదు. దీంతో పెళ్లిళ్ల పేరయ్యల అవసరం పెరిగింది. కొందరు అమ్మాయిలకే ఎదురు కట్నం ఇచ్చి చేసుకుంటుండగా మరికొందరు పొరుగు రాష్ట్రాల్లోని యువతులను వివాహమాడుతున్నారు.

ముహూర్తాలు బాగున్నాయి



ఈఏడాది పెళ్లి ముహూర్తాలు బాగున్నాయి. పైగా శుభకృత నామ సంవత్సరం రావడంతో ఏప్రిల్, జూలై నెలలు మినహా మిగతా పది నెలలు మంచి ముహూర్తాలు ఉన్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు తదితర శుభకార్యాలకు ఈ సంవ్సతరం చాలా అనుకూలం. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి ఏడాది పొడవునా వివాహాలు జరుగుతాయి.

–ఆలూరి రాఘవేంద్రప్రసాద్, వేదపండితులు, కొలిమిగుండ్ల

ఈ ఏడాదిలో ముహూర్తాల వివరాలు	
జనవరి :	25, 26, 27, 28 తేదీలు
ఫిబ్రవరి:	1, 8, 9, 10, 11, 12, 15, 16, 22, 23, 24, 25
మార్చి:	1, 5, 8, 9, 10, 11, 15, 17, 18, 22, 23, 24, 26
మే:	3, 4, 5, 6, 7, 8, 10, 11, 12, 13, 21, 26, 27, 28, 30, 31
జూన్:	1, 3, 7, 8, 9, 10, 11
ఆగస్టు :	19, 20, 22, 24, 26, 29, 30, 31
సెప్టెంబర్:	1, 2, 3, 6, 7, 8
అక్టోబర్:	18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31
నవంబర్:	1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29
డిసెంబర్:	3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31 తేదీలు

రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకుకు గాయాలు

వెల్దుర్తి: పెళ్లి పత్రికలు పంచేందుకు వెళ్తుండగా కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. పట్టణ సమీపంలోని చెరుకులపాడు క్రాస్ వద్ద హైవే 44పై మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కోడుమూరు పట్టణానికి చెందిన బోయ మద్దిలేటి తన పెద్దకుమారుడికి పెళ్లి నిశ్చయించాడు. చెరుకుల పాడులోని బంధువులకు పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు చిన్న కుమారుడు హరిశ్చంద్రప్రసాద్‌తో కలిసి బైక్‌పై బయలుదేరాడు. చెరుకులపాడు క్రాస్ వద్ద యూటర్న్ తీసుకుంటుండంగా వెనుక నుంచి కారు వచ్చి ఢీకొంది. ఈఘటనలో గాయపడిన తండ్రి, కొడుకును స్థానికులు 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాద స్థలంలో పెళ్లి పత్రికలు, రూ.లక్ష నగదు పడి ఉండగా తీసుకెళ్లి బాధితులకు అందజేశారు. రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతిచెందిన అభిషేక్

ఆలూరు రూరల్: మండల పరిధిలోని మనేకుర్తి గ్రామం వద్ద నేషనల్ హైవే 167లో లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా డిసూగుర్ గ్రామానికి చెందిన బిందు, రాజేష్ దంపతుల కుమారుడు అభిషేక్ (23) రాయచూర్ నుంచి పని నిమిత్తం స్కూటర్‌పై బళ్లారికి వెళ్తున్నాడు. ఆలూరు నుంచి ఆదోని వైపు వెళ్తున్న లారీ ఏపీ 02 టీఈ 2170 ఎదురుగా వచ్చి బలంగా ఢీ కొంది. ప్రమాదంలో అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మృతదేహాన్ని ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు బెంగళూరులోని దయానంద ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాయక్ తెలిపారు.

ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్) : ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తే సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆరోగ్యశ్రీ అమలుపై సంబంధిత వైద్యాధికారులు, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. అయినప్పటికీ జిల్లాలో ఉన్న తొమ్మిది ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని ఆయన పేర్కొన్నారు. డబ్బు వసూలు చేసే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రాంజీ నాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రఘు, ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు పాల్గొన్నారు.

రాత్రి గస్తీకి ప్రత్యేక పోలీసు బృందాలు

కర్నూలు: నగరాన్ని సేఫ్ సిటీగా మార్చేందుకు రాత్రి గస్తీకి 22 వాహనాలతో ప్రత్యేక పోలీసు బృందాలను నియమించినట్లు ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే కాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు నగర ప్రజలకు ఎక్కడ సమస్యలున్నా (కాలనీలు, వీధులు, పరిసర ప్రాంతాలు) పోలీస్ పెట్రోలింగ్ కోసం కర్నూలు పోలీస్ వెబ్‌సైట్‌లో http:// kurnoolpolice. in/ safecity లింక్‌ను క్లిక్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. రోజూ పోలీసులు రాత్రి 7 నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు రాత్రి గస్తీ నిర్వహిస్తారన్నారు. పోలీస్ వెబ్‌సైట్ ప్రారంభించిన అనతి కాలంలోనే 79 మంది ఫిర్యాదులు నమోదు చేసి వెబ్‌సైట్ ద్వారా లబ్ధి పొందారని ఎస్పీ తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లు ఇచ్చే సంస్థలపై చర్యలకు వినతి

కర్నూలు కల్చరల్: నకిలీ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లు ఇచ్చే సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా శాఖాధికారి జమీర్‌బాషాకు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకొని బోగస్ డిప్లొమా ఇన్ వెటర్నరీ సైన్స్ సర్టిఫికెట్లను నిరుద్యోగులకు భారీగా అమ్ముతున్నారని అలాంటి ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వస్తుండటంతో నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్, నగర అధ్యక్షుడు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిస్వామి, నగర కార్యదర్శి బీసన్నలు డీవీఈవోకు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

నూతన వంగడాలతో అధిక దిగుబడులు



పప్పు శనగలో దిగుబడులను పరిశీలిస్తున్న పీఎల్ వరలక్ష్మి, శాస్త్రవేత్తలు

వెల్దుర్తి: పప్పు శనగలో నూతన వంగడాల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖాధికారి పీఎల్ వరలక్ష్మి అన్నారు. మండల కేంద్రం వెల్దుర్తితో పాటు, బొమ్మిరెడ్డిపల్లె, మల్లెపల్లె, చెరుకులపాడు గ్రామాల పరిధిలో వైఎస్సార్ పొలంబడిలో సాగు చేసిన పప్పు శనగ కోతకొచ్చాయి. మంగళవారం నంద్యాల ఆర్ఏఆర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి. విజయలక్ష్మి, డాక్టర్ మంజునాథ్‌తో కలిసి ఆమె ఆ పంట దిగుబడులను పరిశీలించారు. ఎన్‌బీఈజీ 452, 49, 779 రకాలు మంచి దిగుబడులిచ్చినట్లు గుర్తించారు. అనంతరం చెరుకులపాడు గ్రామంలో పీఎల్ వరలక్ష్మి రైతులతో మాట్లాడుతూ రైతులు పంట సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక దిగుబడులు ఇచ్చే నూతన వంగడాల సాగు వైపు మొగ్గుచూపాలని రైతులకు సూచించారు. అలాగే సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు శశిధర్‌రెడ్డి, అక్బర్‌బాషా ఉన్నారు.

డీడీఓలకు అవగాహన అవసరం



టీడీఎస్ డిడక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

కర్నూలు(సెంట్రల్): ట్యాక్స్ డిడక్షన్స్‌పై డీడీఓ (డ్రాయింగ్ డ్రాఫ్ట్ ఆఫీసర్)లకు అవగాహన అవసరమని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అన్నారు. టీడీఎస్ డిడక్షన్స్‌ను మదింపు చేయు సమయంలో తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. లేని పక్షంలో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ ప్రభుత్వ విభాగాలకు సంబంధించిన డీడీఓలకు ఇంకమ్ ట్యాక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగస్తులు ఎవరికి వారు సొంతంగా టీడీఎస్ డిడక్షన్‌లను చేసే విధంగా తయారు కావాలన్నారు. ట్రెజరీ డీడీ రామచంద్రరావు మాట్లాడుతూ..టీడీఎస్ డిడక్షన్లపై అవగాహన ఉంటే తప్పులు జరగవన్నారు. అనంతరం తిరుపతికి చెందిన ఇంకమ్ ట్యాక్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ డీడీఓలకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల సలహాలు, సందేహాలను ఆయన తీర్చారు. నిబంధనలను విశదికరించడంతో శిక్షన ఎంతోఉపయోగపడింది. కార్యక్రమంలో కర్నూలు ఇంకమ్ ట్యాక్స్ ఆఫీసర్‌కేవీ రంగారావు, కలెక్టర్ కార్యాలయ ఏఓ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

5న జాతీయ ఉపకార వేతన పరీక్ష

కర్నూలు కల్చరల్: జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)ను ఫిబ్రవరి 5వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయ వెబ్‌సైట్ www. bare.ap.gov.inలో లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు డీఐఎస్ఈ కోడ్ ద్వారా లాగిన్ అయి తమ విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

15లోగా డీఈఎల్ఈడీ పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు కల్చరల్: డీఈఎల్ఈడీ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 15వ తేదీలోగా చెల్లించాలని డీఈఓ వి.రంగారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 2015-17 బ్యాచ్ నుంచి 2018-20 బ్యాచ్ వరకు స్పాట్, మేనేజ్‌మెంట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులకు రానున్న ఏప్రిల్/మే నెలల్లో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఫెయిల్ అయిన అభ్యర్థులు ప్రైవేట్‌గా హాజరయ్యేందుకు అర్హులని తెలిపారు. నాలుగు సబ్జెక్టులకు రూ.150, మూడు సబ్జెక్టులకు రూ.140, రెండు సబ్జెక్టులకు రూ.120, ఒక్క సబ్జెక్టుకు రూ.100 ఫీజు చెల్లించాలని సూచించారు. రూ.50 ఫైన్‌తో ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఫీజు చెల్లించొచ్చని తెలిపారు.

ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలు వేలం

కర్నూలు: పొరుగు రాష్ట్రాల మద్యం, నాటుసారా, ఇసుక అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలను ఈనెల 28వ తేదీన వేలం వేయనున్నట్లు కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 28వ తేదీ ఉదయం 10 గంటలకు కర్నూలు సెబ్‌స్టేషన్‌లో రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సీఐ పేర్కొన్నారు.

2 నుంచి ఏక పాత్రాభినయం పోటీలు

కర్నూలు కల్చరల్: ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 2,3 తేదీల్లో రాష్ట్ర స్థాయి ఏక పాత్రాభినయం, పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయని, పాల్గొనే వారు 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇస్తామన్నారు.

నేను కచ్చితంగా ఓటేస్తా..

- నేడు జాతీయ ఓటరు దినోత్సవం
- కొత్త ఓటర్లు ఎప్పుడైనా నమోదు చేసుకోవచ్చు
- జిల్లాలో యువ ఓటర్లు 9,48,980
- నూరేళ్లు నిండిన ఓటర్ల సంఖ్య 808

కర్నూలు(సెంట్రల్): ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలు. వారి మనోభావాలను ప్రకటించేందుకు ప్రజల చేతిలో ఉన్న ఏకైక పదునైన ఆయుధం ఓటు. ప్రజల గళం వినిపించాలన్నా.. ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలన్నా.. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కు వినియోగించుకోవాలి. వజ్రాయుధం లాంటి ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న 'జాతీయ ఓటరు దినోత్సవాన్ని' నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా 'నేను కచ్చితంగా ఓటేస్తా' అనే యువ నినాదంతో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కర్నూలు జిల్లాలో మొత్తం 19,40,628 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో ఇందులో పురుషులు 9,65,685 మంది, స్త్రీలు 9,74,649 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లలో మహిళల ఓటర్లసంఖ్య 8,964 ఎక్కువగా ఉంది. అలాగే నూరేళ్లు దాటిన ఓటర్లు 808 మంది ఉన్నారు. 90-99 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లు 4,397 మంది ఉన్నారు. 80-89 ఏళ్ల మధ్య ఉన్న ఓటర్లసంఖ్య 28,267గా ఉంది. ఇక అత్యధికంగా జాబితాలో యువ ఓటర్లు ఉన్నారు. 18 నుంచి 39 ఏళ్ల మధ్య ఏకంగా 9,48,980 మంది ఓటర్లు ఉన్నారు. ఓటరు జాబితాలో దాదాపు సగానికిపైగా యువతే ఉండడం ప్రజాస్వామ్యానికి ఎంతో బలం.



365 రోజుల పాటు నమోదుకు అవకాశం

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించింది. దీంతో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలి. గతంలో జనవరి 1వ తేదీ నాటికే మాత్రమే 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు ఇచ్చేవారు. ఈ ఏడాది నుంచి సంవత్సరంలో ఎప్పుడు 18 ఏళ్లు నిండిన అదే సమయం నుంచి ఓటును ఏపీ సీఈఓ సైట్ ద్వారా 365 రోజులపాటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏటా అక్టోబర్ – జనవరి మధ్యలో ఓటరు నమోదు సవరణ జాబితాను సిద్ధం చేస్తారు. అందులో 18 ఏళ్లు నిండి భారతీయులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చు. భారతదేశ పౌరసత్వం కలిగి ఉండి విదేశాల్లో ఉండే వారు కూడా తగిన ఆధారాలు చూపి ఓటరుగా నమోదు కావచ్చు. కాగా, ఇప్పటి వరకు ఏటా ఒక్కసారి మాత్రమే ఓటరు సవరణ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించేది. ఈ ఏడాది నుంచి ఎప్పుడు 18 ఏళ్లు వచ్చిన ఓటును నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

వయస్సు (సంవత్సరాలు)	ఓటర్ల సంఖ్య
18-19	13,474
20-29	3,69,134
30-39	5,66,372
40-49	4,40,799
50-59	2,85,976
60-69	1,74,172
70-79	93,229
80-89	28,267
90-99	4,397
100+	808

నేడు యువ, వృద్ధ ఓటర్లకు సన్మానం..

జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవగాహన కోసం ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపడుతున్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే కార్యక్రమానికి కలెక్టర్, జేసీతోపాటు ఇతర ఉన్నతాధికారులు హాజరవుతారు. ఇదే కార్యక్రమంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారు. అంతేకాక కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఐదుగురు యువకులకు, ఐదుగురు అత్యంత సీనియర్ ఓటర్లకు సన్మానం చేయనున్నారు.

క్లుప్తంగా

ప్రారంభోత్సవానికి సిద్ధం



నిర్మాణం పూర్తయిన బుర్రారెడ్డిపల్లె గ్రామ సచివాలయం

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లెలో గ్రామ సచివాలయం భవనం నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. రూ.40 లక్షలతో ఈ భవనాన్ని నూతన హంగులతో నిర్మించారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్, డిజిటల్, ఇంజినీరింగ్, వ్యవసాయ, వేల్ఫేర్ అసిస్టెంట్లకు వేరువేరుగా గదులను నిర్మించడంతో ప్రజా సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా భవనాన్ని ప్రారంభించనున్నట్లు సచివాలయ కన్వీనర్ శ్రీపతి ప్రసాద్ తెలిపారు.

గుడ్ సమారిటన్‌కు రూ.5 వేల ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఆర్‌టీఓ శ్రీకాంత్

నంద్యాల(అర్బన్): ప్రమాదం జరిగిన మొదటి గడియలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే గుడ్ సమారిటన్‌కు ప్రభుత్వం రూ.5 వేలు ప్రోత్సాహం అందజేస్తుందని ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ శ్రీకాంత్ తెలిపారు. 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి గుడ్ సమారిటన్ చట్టం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రసాదరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆర్‌టీఓ శ్రీకాంత్ మాట్లాడుతూ.. రహదారి భద్రత గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించాలన్నారు. ఏఎంవీఐ నాగేంద్ర, ఏఓ సువర్ణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈబీసీ సంఘం చైర్మన్‌గా చెన్న కృష్ణారెడ్డి




నంద్యాల(రూరల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎకనామికల్ బ్యాక్ వర్డ్ క్లాస్ (ఏపీ ఈబీసీ) చైర్మన్‌గా నంద్యాల మండలం భీమవరం గ్రామానికి చెందిన చెన్న కృష్ణారెడ్డిని నియమించినట్లు ఆయన మంగళవారం మీడియాకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో సోమవారం జరిగిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తనకు నియామక పత్రాన్ని అందజేశారన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ స్పష్టం చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ.. 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌ల నిధులు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు బాషా, నాగూర్‌వలి, రవి, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



గ్రామంలోని వీధుల్లో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని అమ్మిరెడ్డి నగరం గ్రామంలో మంగళవారం రాత్రి సర్పంచ్ లక్కు మాధవి ఆధ్వర్యంలో దోమల నివారణకు ఊరంతా ఫాగింగ్ చేయించారు. గ్రామాల్లో దోమలు అధికంగా ఉండటంతో సర్పంచ్ అధికారులతో మాట్లాడి పొగ మందు పిచికారీ చేయించారు. గ్రామం చుట్టూ వరిపొలాలు ఉండటంతో దోమలు అధికమై పాడి గేదెలు, ప్రజలు ఇబ్బందులు పడుతుండంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

శ్రీశైలంలో ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీశైలదేవస్థానం శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రవచన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఈఓ ఎస్ లవన్న మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మప్రచారం, ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా దేవస్థానం ప్రఖ్యాత ప్రవచకులు డాక్టర్ బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మచే ప్రవచనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శివనామ మహిమపై ఈ ప్రవచనాలను ఏర్పాటు చేశారు. ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్య కళారాధన వేదికపై మూడు రోజుల పాటు ప్రతి రోజు 7 నుంచి 9 గంటల వరకు ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు.

జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

- 13,781 మెట్రిక్ టన్నుల నిల్వ
- కొరత ఉందనే పుకార్లను నమ్మొద్దు
- అధిక ధరలకు విక్రయించే డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తాం– జేడీ మోహన్‌రావు



పొలంలో ఎరువు చల్లుతున్న రైతు, (ఇన్‌సెట్) జేడీ మోహన్‌రావు

నంద్యాల(అర్బన్): జిల్లాలో రబీ సీజన్‌లో రైతులకు అందించేందుకు 13,781.453 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ఎరువుల కొరత ఉందంటూ వచ్చే పుకార్లను రైతులు నమ్మవద్దని, అధిక ధరలకు విక్రయించే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల కొరత సృష్టించే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో రబీ కింద సాధారణ సాగు విస్తీర్ణం 1.85 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటి వరకు దాదాపు 1.27 లక్షల హెక్టార్లలో వరి, పప్పు శనగ, జొన్న, మినుము, మొక్కజొన్న తదితర పంటలు సాగు అయ్యాయన్నారు. అందులో వరి సాధారణ విస్తీర్ణం 29,975 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 13,597 హెక్టార్లలో సాగు అయ్యిందన్నారు. వరి పంటకు సంబంధించి ఫిబ్రవరి నెలాఖరు వరకు నాట్లు వేసుకోవచ్చన్నారు. జనవరి నెలకు మరో 16 వేల హెక్టార్లలో నాట్లు పడనున్నాయని, అందుకు 4,718 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని చెప్పారు. డిసెంబర్ నెలకు 6,487 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 10,354 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. జనవరి నెలకు 7,733 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా 6,587 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. ఈ నెలలోనే ఎంసీఎఫ్ఎల్ యూరియా రేక్ 624 మెట్రిక్ టన్నులు వచ్చిందని, ఇంకా 4,200 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చే అవకాశాలు ఉన్నాయని వివరించారు. నంద్యాల జిల్లాలో హోల్‌సేల్ డీలర్ల వద్ద 2,767.271 మెట్రిక్ టన్నులు, రిటైల్ డీలర్ల వద్ద 9,582.237 మెట్రిక్ టన్నులు, రైతు భరోసా కేంద్రాల్లో 1,431.945 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎలాంటి యూరియా కొరత లేదని, అదే విధంగా యూరియాను పొలంలో ఒకేసారి వేయకుండా దశలవారీగా వేసే విధంగా రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో యూరియా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారనే ఫిర్యాదులు రాలేదని, అలాంటి ఫిర్యాదులు వస్తే ఎఫ్‌సీఓ 1985 ప్రకారం సదరు డీలర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

నంద్యాల(వ్యవసాయం): యాంత్రిక సమాజంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడుతాయని బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ది శ్రీనివాసులు, కోటకొండ శ్రీనివాసులు అన్నారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు రిపబ్లిక్ డే సందర్భంగా క్రీడా పోటీలను నిర్వహించారు. న్యాయవాదులకు క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్ తదితర పోటీలను నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా సీనియర్ న్యాయవాది అమీర్ వ్యవహరించారు. క్రీడల్లో విజేతలైన న్యాయవాదులకు రిపబ్లిక్ డే రోజున జడ్జీల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నిత్యం న్యాయవాదులు కక్షిదారులతో ఉండటం వల్ల మానసిక ఉల్లాసాన్ని కోల్పోతున్నారని, యాంత్రిక జీవనం వల్ల అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకంగా ఉందన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ముక్కెర కృష్ణారెడ్డి, న్యాయవాదులు మురళీ, రామ్మోహన్ రెడ్డి, ఓబులరెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి
- కొత్తపల్లెలో అనూహ్య స్పందన
- ఎమ్మెల్యేకు హారతులు పట్టిన గ్రామ ప్రజలు



కొత్తపల్లె గ్రామంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రవిచంద్రకిశోర్ రెడ్డి

నంద్యాల(రూరల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రతి గడపలో సంక్షేమ వెలుగులు నిండాయని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామంలో ఎమ్మెల్యే, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరేంద్రరెడ్డి, శరత్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, అధికారులతో కలిసి నిర్వహించారు. గడప గడపకు తిరిగి లబ్ధిదారులకు గడిచిన మూడున్నరేళ్లలో అమలు చేసిన పథకాలను వివరించి బుక్‌లెట్లను అందజేశారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు హారతులు పడుతూ ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరును చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నాయన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందేవని గుర్తుచేశారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఇళ్ల వద్దకే చేరుస్తున్నామని చెప్పారు. నంద్యాల మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, ఎంపీటీసీ బొజ్జ హరినాథ్‌రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వేద పండితులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల పూజ, జప పారాయణాలు, క్షీరాధివాసం, దీక్షా హోమం, ఆవాహిత దేవతా హోమం, గణపతి, రుద్ర, వాస్తు హోమాలు గావించారు. అలాగే ప్రదోషకాల పూజ, పంచగవ్య ఆదివాసంమూల యంత్ర హోమం, అర్చనలు నిర్వహించారు. ప్రతిష్ఠోత్సవాల్లో ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలన్నీ ముగియగానే వారిని ఆలయ నిర్వాహకుల సమక్షంలో వేద పండితులు శాలువా, పూలమాలలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రామిరెడ్డి, చోళవేటి లక్ష్మీనారాయణ, నూకల కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: జగనన్న లేఅవుట్లలో నిర్మించనున్న ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచి ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ఇళ్ల నిర్మాణాల ప్రగతి, ఉపాధి కూలీల పెంపు, 6వ విడత జగనన్నతోడు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉగాది నాటికి 10,004 ఇళ్లు పూర్తి చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 950 గృహాలు పూర్తయ్యాయని, మిగతా గృహాలను అన్ని దశల్లో పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 2179 గృహాలను స్టేజ్ కన్వర్షన్‌కు తీసుకువచ్చారన్నారు. ఇళ్ల నిర్మాణాల దశలను జియో ట్యాగింగ్ చేసి, ఎం.బుక్ రాసి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రతిరోజు లక్ష మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. 6వ విడత జగనన్న తోడు కింద గుర్తించిన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, హౌసింగ్ పీడీ శేషుబాబు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో ఉద్యోగులు, వైద్యులు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల్లో సభ్యత్వం తీసుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) పుల్లయ్య పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం పొందిన వారికి మంగళవారం కార్డులను అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్న రెడ్‌క్రాస్ సంస్థలో అన్ని వర్గాల వారు సభ్యులుగా చేరి బలోపేతం చేయాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 96189 00909ను సంప్రదించాలన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అందించండి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

దొర్నిపాడు: రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని కాలం చెల్లిన, నాశిరకం ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి ఫర్టిలైజర్ షాపు యజమానులకు సూచించారు. మంగళవారం దొర్నిపాడులోని ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. దుకాణంలో నిల్వ ఉన్న రసాయన, క్రిమీ సంహారక మందులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. దుకాణాల లైసెన్స్‌ను ప్రదర్శించడంతో పాటు స్టాక్, బిల్‌బుక్‌ను ఏఓతో ధ్రువీకరించుకోవాలన్నారు. ఒక బయోమెట్రిక్ విధానంలో విక్రయాలు చేపట్టాలన్నారు. ఏఓ శ్రీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఈ–పాస్ విధానం తప్పనిసరి

ఉయ్యాలవాడ: ఎరువుల దుకాణాల యజమానులు క్రయ విక్రయాలలో ఈ పాస్ విధానం తప్పనిసరిగా పాటించాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. మాయలూరులో ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వేలిముద్రలు తీసుకునే ఎరువులు, క్రిమీ సంహారక మందుల విక్రయాలు జరపాలన్నారు. ఇలా చేయడం ద్వారా స్టాక్ వివరాలు కూడా ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి, రైతుకు ఏ మేరకు ఏ మందు విక్రయించారన్నది తెలుస్తుందన్నారు. దుకాణ యజమానులు ఈ పాస్ విధానం పాటించకపోతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం



వ్యాపారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): ప్రజా ప్రయోజనాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను పట్టణంలో నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక మున్సిపల్ టౌన్ హాల్‌లో ప్లాస్టిక్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. పట్టణంలో ఉన్న వ్యాపారులు, ప్రజలు తప్పనిసరిగా ప్లాస్టిక్‌ను నిషేధించి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ బ్యానర్లు (ఫ్లెక్సీ)లను పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల్లో చైతన్యం కలిగించి పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులను కోరారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ మధుకుమార్, మెప్మా సీఎంఎం (సిటీ మిషన్ మేనేజర్) విజయభాస్కర్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగరాణి కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి సూపర్‌వైజర్ ఆరోగ్యమ్మకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, పర్యవేక్షణ పేర్లతో వేధింపులు ఆపాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలన్నారు. గ్రాట్యూటీతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. సీనియర్ జిల్లా కార్యదర్శి నిర్మల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, కార్యదర్శి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌వైజర్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఎరువులు ఎమ్మార్పీకే విక్రయించాలి



యూరియాను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గోస్పాడు: ఎరువులు, పురుగు మందుల దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే మందులను విక్రయించాలని కోవెలకుంట్ల సహాయ సంచాలకులు కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని గోస్పాడు, యాళ్లూరు గ్రామాల్లో ఏఓ అబ్దుల్‌హక్ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ షాపులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. ఎరువు, మందుల కృత్రిమ కొరత సృష్టించరాదని, అలాంటి చర్యలకు పాల్పడితే సంబంధిత శాఖ ఆధ్వర్యంలో చట్టరీత్యా లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. మందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, నిల్వలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నమోదు చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందించాలని చెప్పారు. రానున్న రోజుల్లో తనిఖీలు విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల(వ్యవసాయం): ఆల్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే సందర్భంగా మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో కర్నూలు ఉమ్మడి జిల్లా స్థాయి ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జిల్లా క్రీడాధికారి నరసింహరాజు, రామకృష్ణ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో చెస్ పోటీలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. చెస్ పోటీలతో ఏకాగ్రతతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఇమామ్, హుసేన్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాద పద్మారాధన సేవ



అష్టాదళ పాద పద్మారాధన సేవలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి అష్టాదళ పాద పద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలు, నిమ్మరసంచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం 108 వెండి పుష్పాలచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చీర, ఒడి బియ్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్రాచారి, సుబ్బాచారి, ఆరవేటి వాసు, విజయకుమార్, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

నంద్యాల(అర్బన్): జిల్లావ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రఫీ, కార్యదర్శి నాగరాజు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పీడీఎస్‌యూ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక వసతులతో పాటు వార్డెన్ల కొరత ఉందన్నారు. ఇన్‌చార్జ్ వార్డెన్‌లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. నాయకులు అజీస్, నవీన్, గిరి, హరి, నాగరాజు, వెంకట్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ అంజలి

ఆళ్లగడ్డ: బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశాభివృద్ధి శరవేగంగా సాగుతుందని, నేటి తరం బాలికలు అన్ని రంగాల్లో సత్తా చాటాలని చాగలమర్రి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అంజలి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా చాగలమర్రి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీడీపీఓ తేజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ తేజేశ్వరి మాట్లాడుతూ.. బాలికల భాగస్వామ్యం అన్నింట మరింత పెరగాలన్నారు. విద్యాభివృద్ధి ద్వార మాత్రమే సమాజంలో సమానత్వాన్ని చాటగలుగుతున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని, లింగ వివక్ష చూపకుండా మగ పిల్లలతో సమానంగా పెంచాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాలికలకు ప్రోత్సాహక బహుమతలు అందజేశారు. వైద్యాధికారి ఇమ్రాన్, ప్రిన్సిపల్ హుస్సేన్‌బి ఉన్నారు

బాలికలు సత్తా చాటాలి

రుద్రవరం: బాలికలు అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా సత్తా చాటి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసులు బాలికలకు ఆత్మ రక్షణకు సంబంధించిన పలు విద్యలపై శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ముందుండాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచి వృద్ధిలోకి రావాలన్నారు. ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఉయ్యాలవాడ: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీశైలజ పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండులో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత లక్ష్యాలతో విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యతు ఉంటుందన్నారు. బాల్య వివాహాలు, బాలికల హక్కుల చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన బాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్‌రఫీ, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజేశ్వరి, ఫకూర్‌బీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.